


## మల్లాది కథలు

తెలుగు కథా కన్యకు మల్లెపూలూ, మరువమూ కలిపి
దండలు కట్టి ఇచ్చి జవ్వనాల కవ్వింపులు నేర్పిన వారు
శ్రీ మల్లాది రామకృష్ణశాస్త్రి.

అయన కథలు పైలాపచ్చీసుగానూ ఉంటాయి, లోలో
గుచ్చేసుకుంటూనూ ఉంటాయి. ఆయన పలుకులు కస్తూరి
గంధాలూ వెదజల్లుతాయి, కనిపించని సూదులూ విసరుతాయి.

తెలుగువాడి మార్దవమూ - మాత్సర్యమూ, విశృంఖలతా - విధ్యుక్త
జీవనమూ, వైభోగమూ - ఆ బోర్ధుదక్కనితనమూ అన్నీ కలైడోస్కోపులో
చూపిస్తారు మల్లాది వారు.

అంతలంతలేసి 'ధ్వని' ఆయనకే చెల్లు! ఇంత
లింతలేసి మాటల్లో సౌకుమార్యమూ ఆయన గుత్త సొత్తే!
ఆయన హాస్య చతురత అందుకోవడానికి 'డొక్క శుద్ధి' ఉండాలి.
తెలుగువాడి సాంస్కృతిక వైభవం ఆయన కథల్లో వెల్లివిరిసి
కప్పురపు తావులు వెదజల్లుతుంది. తెలుగు పలుకులోని
విరువులన్నీ మెరుపుల్లా విసురుతుంది ఆయన కలం!

కవి కథకుడైతే కనిపించే చెమక్కులన్నీ ఆయన కథల్లో దర్శన
మిస్తాయి. పాట కట్టినా, కథ చెప్పినా అనితరసాధ్యం ఆయన మార్గం!

అలాటి మహా శిల్పి రచించిన అపురూపమైన
కథల్లో 'దీపశిఖ' ఒకటి. ఇంతవరకూ ఎక్కడా
అచ్చుపడని 'దీపశిఖ'ను మల్లాది వారి జయంతి
సందర్భంగా 'ఆంధ్రప్రభ' పాఠకులకు అందిస్తున్నాం -
అందుకోండి.

[జూన్ 17న మల్లాది వారి జయంతి సందర్భంగా]

# దీపశిఖ

## శ్రీ.శ్రీ.॥ మల్లాది రామకృష్ణశాస్త్రి

'ఆకాశమంత ఐదోతనానికి నోచుకున్న ఇల్లాళ్లు
భూదేవమ్మంత పుణ్యం చేసుకోవాలి మాయమ్మా!'

- ఏలినవారి పురుడు చేసి, బొడ్డు కోసిన మంత్రసాని. అర్థాల బాలుడికి అల్లారు ముద్దులు నేర్పి, - అందమంత ఆడంబరం నేర్పి, - తీవరాలు నేర్పి తీవులు నేర్పి, తన పెంపకంలో పెరగక ముందే పెద్దను చేసి, వారిని పడకటింటి వారిని చేసిన పెద్దదాది - ఆ వేళ, ఏదీ కాని వేళ దేవేరమ్మ గారు తా ననుకున్నట్లే యథాప్రకారంగా - చిన్నబోయి - చింతాక్రాంతులై ఉన్నటువంటి సమయంలో అడుగులు లెక్కపెట్టుకుంటూ మహాల్‌లోకి వచ్చి, వారి వంక చూసీ చూడని తీరున పరకాయించి, ఎదుటపడీ పడక, నడుం గోడకు ఆనించి, చేత్తో గొంతు సవరించుకుని ముసలి పాపిట మునిగోట దిద్దుకుని, కోక చెంగు పెదవికి అడ్డం చేసుకుని ఎటో చూస్తూ, ఇటు పలుకుతూ స్వతంత్రంగా సణుగుతున్నట్టు గదమాయింపుగా మనవి చేసినట్టు, సవినయంగా చనువుగా కూకలు వేసినట్టు ఎలా ఎలా మాటలల్లిందంటేనూ -

"రాణీ వాసంలో బంగారు తల్లులూ!

"తినేది మీ వణ్ణం, కట్టేది మీ కోకలు -

"చేసేదీ మీ ఊడిగం, అనుభవించేది మీ వైభోగం!

"కనుకనే ఈ తపన!

"మా కడుపులు చల్లబడితే చాలవు దొరసానమ్మగారూ! మా కన్నులు చల్లబడాలి - అదివ్వుడమ్మా?

"పట్టం గట్టుకున్న ఏలినవారిని రెండు వుష్కరాల నాడు పొత్తిళ్లలో పరుండబెట్టాను. ఈ ఇంద్ర భవనంలో ఉయ్యాల కట్టాను. ఆ పండుగనాడు - అప్పటి అన్నదాతలు దయచేయించిన పెద్ద మొహరీలు, ముచ్చికి మూడు కుచ్చేలుగా పదిమంది పేరంటాళ్లకు తలొక్కటీ చేతిలో పెట్టాను. ఈ ఊగూగు ఎల్లకాలం ఈ పుణ్యానే పోవాలని, వేసిన తొట్టి తీయకుండా కోటలో పండూ, తోటలో పండూ - ఆరగారగా చేతి కందాలని వారు దీవించారు మాయమ్మా!

"కాని, తల్లులూ! దివాణంలో కనీ పెంచే రాణీవాసంలో వేసిన ముగ్గు చెరగలేదు. మెడలో హారాలూ, పలకసరులూ చిక్కులు పడలేదు. అద్దాలలో బిడ్డ కేఁరు మనలేదు.

"అడుగులకి అరిసెలూ, అందరసాలూ

"పలుకులకి చిలకలూ చిట్టి బూరెలూ వంచిపెట్టలేదు.

"మన తోటల్లో ఫలవృక్షాలు వద్దన్న కొద్దీ అక్కరకు వస్తున్నాయి. మరి మీరే మమ్మల్ని ఇంత చిన్న చూపు చూశా రేవమ్మా!" అని వనవి వనవి పలుకంగా,

"మాకు ఆపాటి తెలియదటే! కాని -

"మే మేం జేతుమే -

"మమ్మల్ని కన్నవారి వంగడంలో, ఏలినవారి వంశంలో ఏవంక జూసినా ఈ సాక్కు లేదు. మరి మా తీరే మంగలాన జాజులు వ్రేచి రన్నట్లాయెనే. లోకోత్తరుల మని అందరూ అనడమే కాని, లోకంలో ఇల్లాళ్లపాటి సేయకపోతిమే!" అని దేవేరమ్మ వాతెర బెదర సెలవీయంగా, -

"... ... ఎంతమాట! ఎంతమాట!

"అమ్మాయమ్మగారూ! లోకంతోసాటి మీ కేల, మీ సాటి మీది!

"చెరువు ఎంత ఎండనీ చెలమకు లోకువ కాదు.

"మీకు పోణెం తప్పలేదు - పోడిమి తప్పలేదు!


"కాని, ఏటివార నుండి, ఏవు మీ దుండి ఈ ఫలవృక్షం ఎంతకాలం చిగురు మీదే ఉండేను కాని, కావుకు రాదేం చెపుమా - అని ఒక్కరు అనుకోకపోతిరి; ఎవ్వరూ పట్టించుకోకపోతిరి.

"అందరి మాట కేం గాని, నాకు మట్టుకు ఇదే ఆలావనైపోయె!

"చూడగా, చూడగా ఏమని తోస్తున్న దంటే, ఇంటికో వంటికో ఏదో అంకిలి కద్దమ్మా! కాని, అది, రూఢి కావాలి! ఆయెటో, అది చక్కదిద్దడానికి క్షణం పట్టదు!

"అఁ, ఇంతకూ చెప్పవచ్చిం దేమంటే మన పొలిమేరల్లో ఒక జంగంసాని తిరుగుతూ ఉంది.

"దాని రూపులో చంద్రు డున్నాడు, చూపులో సూర్యు డున్నాడు; నోట సత్య ముంది, చేత



అమృత ముంది మాతల్లీ! ఎలాగైన ఒక్క వరియాయం మీరు దాని కంట వడితే ..."
- అంటూ గుసుగు నవ్వులు నవ్వింది. పెద్దదాది.

"రప్పించవే."

"రమ్మంటే రాదమ్మ."

"మేము ఆజ్ఞాపిస్తున్నా మని, అనగా - కోటలో వారి సెలవైందని చెప్పవే!"

"మన మాటకు విలు వుండదమ్మా! అది ఎవరికీ లోకువ కాదమ్మా!"

"ఆఁ, అయితే వట్టి తెప్పించవే!"

"అమ్మా! పైరు గాలిని వట్టవల్లన్నా కట్టవల్లనా - అది దేవు ఉంటీదమ్మా! దాని వెంట తీర్థ ప్రజ అనుకోండి."


"మమ్మల్నీ ఆ మూకలో కలుపుతావా, దాని వెంట పడమంటావా?"

"అంత మాట అనలేనమ్మా! కాని, మీరు దాని కంటవడాలంటే మ రో ఉపాయం లేదే."

"లేదేం - నీవు మెదలక పడి ఉండవే! చేయవలసినది చేసేయమని మేము ఆజ్ఞాపిస్తాము." అన్నవారై దేవేరమ్మ గారు ఆ క్షణంలో జంగమసానిని వట్టి మన ఉద్యానవనంలో మామిడి మొక్కకు కట్టమని, కట్టడులు సేయంగా - వారి మాటకన్న వడిగా పరుగున పోయిన భటులు ఒక్క గడియలో తిరిగి వచ్చి, 'సాని కాదమ్మా ఎవడో సన్యాసి' అని విన్నపాలు అంచెల మీద వంపగా,

"అదో వేషములే! అడ దనుకొని మామిడి చెట్టుకు కట్టమన్నాము. ఆ శిక్ష చాలదు. వరకంలో పారేయండి!" అని మరల ముగుదల ఇవ్వంగా-

- ఆము అంతకుముందు చూసినవాడు



దేవుడే అనుకున్న లెంకలు వారి ఉప్పు తింటూన్న పాపాన దేవేరమ్మ గారి ఆజ్ఞకు ఎదురు చెప్పటం చేతకాక, అంతవని చెయ్యలేక, పొలిమేరలో ఉన్న జడలమర్రి చేరువకు పోగా -

మర్రి ఊడల ఉయ్యాల మీదున్న ఆ మనిషి, ఆ దేవుడు చేరవచ్చి చేతులు జాపినాడు. చిరునవ్వు నవ్వినాడు.

లెంకలు కదలలేదు. కాని ఆ చేతుల సంకిలి పడింది. ఎవ్వరూ అడుగు ముందుకు వేసిన తెలివిడే లేదు. కాని, వారు చెరసాలలో ఉన్నారు.

ఈ కబురు అందవలసిన వారికి అందగానే, వారికి బద్ధకం వదిలి మందహాసం చేసిన వారైనారు.

పదము లొత్తుతూన్న దాసీ పడుచుతో వా రన్నారు గదా -

"ఈ సన్యాసులూ, జంగాలూనా మాకు సంతాన మిచ్చేది. మేము తలచుకుంటే క్షణం పట్టదే! ఉన్నవారిని ఉన్నట్టు మేము దయచేయమన్నా మని ఏలినవారికి మా మనవి అందచేయించండి! ఇంతలో మమ్మల్ని అలంకరించండి."

"అమ్మా! ఎండవేళ ..."

"కాదు, మేము పంతము పట్టాము. ఇది పండు వెన్నెలే!"

దేవేరమ్మగారు ఏడు వారాల సొమ్ములూ ధరించుకున్నవారై విడియము చే నందుకుంటూ ఉండగా, ఏలినవారు నిదురలో ఉన్నవారని తెలియరాగా, కూడదని ఎవరూ మనవి చేయలేకపోగా, వారే స్వయముగా అంతటి అలసటా లెక్కసేయకుండా దర్శనానికి దయచేసిన వారైనారు.

అలా దయచేసినవారై, వారి చెక్కిలి మీద వీరు చేయి చేర్చి మెలుకువ కలిగించగా -

"మీరా! ఈ వేళప్పుడు దయచేశారు? దర్శన మిప్పించేందుకు ఇది సమయము కా దని మే మనుకునేమే! ఏ మాపద వచ్చింది?"

"ఆపద కాదు, అవసరం."

"తీరుబడిగా తీర్చేము."

"మా కా తీరుబడి లేదు. మేము కోరిన కోరిక తక్షణం నెరవేరకుండా ఉపేక్ష చేయడం మా పుట్టి నింటి ఆచారం కాదు. ఆ మరియాదలే తాము పాటించడం మేలు."

"మంచిది. సెల విప్పించండి!"

"మేము సంతానవంతులం కాదలచాము."

"మా మంచిది."

"ఆడపిల్ల కలగాలని మా కోరిక. మరి మీ ఆజ్ఞ?"

"కలగక కలిగితే మగపిల్లవాడే కావాలి."

"అని తమ అభిమతమా?"

"అభిమత మనుకోండి, ఆజ్ఞ అనుకోండి. ఆడువారి మాటకు ఆదరణ లేకపోలేదు కాని, మగవారి మాట ఆజ్ఞగా చెల్లడం ఈ కోటలో పరిపాటి. మా మనవి తాము ఆలకించారు, చాలు! మీరు సెలవీయ దలచింది వినే స్థితిలో మేము లేము. మరల నిదురలోకి దయచేస్తున్నాము."

"మంచిది, దయచేయండి! సంజె దీపం వెలిగిన గడియకు అంతఃపురానికి దయచేయండి. మేము రాణివాస ఘుండేము."

- అని "పరివారం ఆవేళకు వచ్చి మనవి చేసేను."

"మా మనవి గురుతుంచుకుని మెలగండి."

"ఒక్కటి మాట! మా మాట చెల్లదే, కోటలో నిలువ పని ఉండదు మీకు. ఏ ఏటి గట్టునో ..."

"ఏ ఏటి గట్టు తాము ఎన్నిక చేశారో, మరుక్షణాన అక్కడే కోట కట్టించేము. కాని, మా రాణివాసాన్ని ఏ కొమ్మ నీడనో ఉంచేమా? మంచిది."

ఏలినవారు నిజానికి నిదురలోకి పోయినారు. దేవేరమ్మగారు ఇక అక్కడ నిలువలేకపోయినారు.

సంజె వ్రాలింది. ఆ వేళకు సంజెదీపం వెలిగింది.

గడియాయె, ఝామాయె వారు దయచేయలేదు.

మింట నున్న వెన్నెల కంటి మీదికి వచ్చింది. దేవేరమ్మ గారు కనురుకున్నారు.

ఒంటిపాటున ఉండగా వల్లమాలిన నిదుర




వచ్చింది. అంతలో నిదురంత మెలకువ వచ్చింది.

సన్నజాజిలా వెలుగుతూన్న దీపం ఉన్నట్టుండి జేగురించింది. మందార పూవులు రాలినట్టు మంటలు; కనుచూపు మేర కణ, శాంత మంత తపన. ఏకాంత మంత గగ్గోలు!

తా నేమాయెనో ఎక్కడ వెదకేను. పరుగులు తీయగా చెరసాల వచ్చె. చేతులకు సంకెళ్లు వచ్చె.

ఫెళ్లున కన్నీళ్లు వచ్చె. కంఠాన శోకమే పరవళ్లు పోయె. పోయి పోయి ప్రవహించే నది కాగా,

ఏటి వాలు మీద పద్మాసనం మీ దున్న ఏదో వెలుగు ఎన్నడూ చూడని పద్మాలు కాగా,

ఒకటికి రెండు తా నందుకునె. తల్లంత మక్కువతో రొమ్ముకు హత్తుకుని పద్మాలు రెండూ పాపలు కాగా -

అదేం పాప, అ దేం పాపం!

తనువులు రెండు, తలలు రెండూ - రూపాలు రెండు. కాని,

ఎంత దూరాన్నుంచో ఏలినవారు నవ్వారు.

మగపిల్లడే!

వీరూ నవ్వారు.

ఆడపిల్లే!

ఏ పిల్ల కా పిల్లే. కాని కటూకట్టుగా ఒకటే.

ఒకరి కొకరం జాడ లేదు.

"ఇద్దరం గెలిచినాము" అని మరల నవ్వారు వారు. "వద్దు వద్దు ఒక్క రుంటే చాలు. ఏ ఒక్కరైనా చాలు!" అంటూ కెవ్వు మన్నారు వీరు.

ఆ బరువును ఏటిలోకి జారవిడిచి మరల కెవ్వుమన్నారు. అంటూనే మేలుకున్నారు.

కల లేదు కాని కలత పోలేదు. మన తెలివి రాలేదు, మన మాట కాదు.

ఎగిరి పడ్డది ఏమో నవ్వింది.

'ఒక్క రుంటే చాలు' సంటూ ఎలుగెత్తి పలికింది.

అలాగట!

ఆ పర్తమాన మందుకున్న వారై, ఏలిన వా రప్పటికి దయచేసి పరిస్థితులను తెలునుకున్నవారై, కొంచెము ప్రథమ చిరాకూ, రవంత చింతా ఆవహించగా అక్కడ నిలువలేక తా మెటు దయచేస్తున్నదీ గమనించక, పోగా పోగా ఏటివారను - పొడి నేలను అట్టే చెమ్మగిలి పొటమరించిన పది చిహ్నాలు కానరాగా తెలివి తెచ్చుకున్నవారై నేల వ్రాలి వానిని కన్నుల కద్దుకోంగా -

వారు అప్పటికి దయవచ్చింది కాబోలు దరిసెన మిచ్చారు. "నాయనా!" అన్నారు. "నన్ను విశ్వల ప్రకాశ మంటారులే! పర్తి పనికిమాలినవాణ్ని! వీడు ఆ డంటారు. వీడు మగ అంటారు. ఏ కన్ను ఏ మందో వీడి కేం తెలును? ఏమీ తెలియనివా ణ్ణని అంబ దయతలచి మరింత పనికిమాలిన వాణ్ణి చేసి, ప్రజలకు దూరం చేసి, వారు ధరించుకుంటారే ఆ చంద్రవంకలోంచి చిటికెడు చిరునవ్వు తీసి ఈ మొగాన రేక దిద్ది, పోరా వెర్రివాడా! అన్నది.

"పోతున్నాను, పోతున్నాను. కాని మనం ఎక్కడికి పోగలం నాయనా! అమ్మ పోనిస్తుందా? ఎప్పుడో అప్పుడు అక్కడికే! నాయనోవ్, నాకు ఆడపిల్లే కావాలని అంబ ఎన్నడన్నా పట్టుపట్టిందా. కోరుకోవాలే కాని కోరిక లిచ్చే ఆ తల్లికి కొరత ఉంటుందా?

"కాదు, కందా మనే అనుకో. కాదూ, కూడ దని పరమేశ్వరుడు - ఆ నాయన అనేవాడా! ఇల్లాలి మాట కా దనేవాడా? తా నెంత ఘటికుడైనా అది దేవు డంతవాడు ఆలిని ఎంతగానో మన్నిస్తాడు. ఊ! నాయనా, ఇక ఏమీ చేతగాక మరేమీ పల్లగాక అర్ధ దేహమే ఆ తల్లి కిచ్చుకున్నాడు ఆ తండ్రి. అంబ అడుగు ముందుకు వేయందీ కదలగలడా.

"నాయనా! లోకేశు లెంతో లోకమూ అంతే - అంతేట!

"నాయనోవ్! అంబ కన్నీ తెలును. నీ నీడ నున్న ఐదో తనం తెలును. తాను నీ కిచ్చిన ఆడంబరం తెలును. అది వారు చేసే ముద్దురా!

"బిడ్డల మీద వారి కున్న మమకారంరా! ఆడిస్తార్రా! అదంతా ఆటరా!

"అమ్మా అంటే తల్లి పలుకుతుంది. అయ్యా అంటే తండ్రి పలుకుతాడు. పిలవక ముందే వా రిద్దరూ ఒక్కరై పలుకుతారు నాన్నా! వినకపోతే ఎలారా?

"నేనే తెలియనివాడినిరా, నీకూ, నాకూ, మీకూ అంబ తెలియజెప్పిందిరా!"

'పోరా, వెర్రివాడా!"

అంతలో ఆ ప్రకాశంలో వారూ -

దేవేరమ్మగారు అంతఃపురంలో గాఢ నిద్రలో ఉన్నారు.

★